
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

ఆదివారం 27 ఏప్రిల్ 2025



ఒకటి కాదు.. రెండు కాదు.. లక్ష్యం చేరుకోవడానికి ఏడేళ్ల సుదీర్ఘ ప్రయాణం. ఇంతకాలం ఒకే లక్ష్యంపై ఫోకస్‌గా ఉండాలంటే ఎంతో మనోధైర్యం ఉంటే తప్ప సాధ్యం కాదు. ఆరుసార్లు సివిల్స్ రాశారు. ఐదుసార్లు ప్రిలిమ్స్ పాసయ్యారు. రెండుసార్లు ఇంటర్వ్యూ వరకూ వెళ్లారు. చివరి ప్రయత్నంలో 316వ ర్యాంకు సాధించారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఈ ఏడాది సివిల్స్‌లో ర్యాంకు సాధించిన ఏకైక మహిళ వీరే. ఈ ప్రయాణం అంత సులభంగా సాగలేదు. ఎన్నో ఎత్తుపల్లాలు. అన్నింటినీ అధిగమించారు. సివిల్స్ సాధనలో ఎదురయ్యే ఇబ్బందులను.. దానికి మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాల్సిన విషయాలను ఆంధ్రజ్యోతికి వివరించారు.

(కడప-ఆంధ్రజ్యోతి)

సివిల్స్‌.. ఒంటరి యుద్ధం



- గోల్ రీచ్‌కావాలంటే కఠోర సాధన తప్పనిసరి
- అమ్మాయిలు రెండింతలు కష్టపడాలి
- చదువుతో పాటు ఆరోగ్యమూ ముఖ్యమే
- సివిల్స్ 316వ ర్యాంకర్ కేఎస్ కీర్తిరెడ్డి

కేఎస్ కీర్తిరెడ్డి తండ్రి కర్ణపు చలమారెడ్డి స్వస్థలం అన్నమయ్య జిల్లా రామాపురం మండలం కర్ణపువాండ్లపల్లె. తల్లి డి.శ్రీకృష్ణ సొంతూరు పులివెందుల మండలం బొగ్గిడివారిపల్లె. వీరిద్దరూ ఎల్ఐసీ ఉద్యోగులు. కడప సింగపూర్‌టౌన్‌షిప్‌లో స్థిరపడ్డారు. కీర్తిరెడ్డి భర్త శ్రీసాయి విజయవాడ ఆల్ ఇండియా రేడియో న్యూస్ హెడ్‌గా ఉన్నారు. సోదరి డిగ్రీ పూర్తయ్యి మాస్టర్స్ చేస్తున్నారు.

చివరిదాకా పోరాడాల్సిందే

నా గోల్ సివిల్స్. గోల్ పెట్టుకున్నాక దాన్ని సాధించేందుకు చివరిదాకా పోరాడాల్సిందే. దీనికి మైండ్‌సెట్ పూర్తిగా మార్చుకోవాలి. ఇదే లోకంగా ఉండాలి. రిజల్ట్ ఎలా అన్నా రానీ.. స్వీకరించాల్సిందే. దానికి సిద్ధంగా ఉంటేనే మనం లక్ష్యం వెంట ప్రయాణం చేయగలం. ఎక్కడా మనం డల్ కాకూడదు. సివిల్స్ అనేది మైండ్ గేమ్. ఎగ్జామ్ అంతా మైండ్‌గేమ్‌లానే ఉంటుంది. ఎవరి గేమ్ వారు ఆడాల్సిందే. దీనికి హార్డ్ వర్క్ చాలా అవసరం.

రూ.60లక్షల జీతంతో

నేనే ఐఐటీలో టాపర్‌ని. నాతో పాటు చదువుకున్న వారు ఇండియాలోనే రూ.60లక్షల జీతంతో పనిచేస్తున్నారు. మొదట్లో మూడుసార్లు రాశాను. తర్వాత పెళ్లయ్యాక కొంత బ్రేక్ వచ్చింది. అయితే మావారు కూడా సివిల్ సర్వెంటే. నిర్మలా సీతారామన్ లాంటి పెద్దపెద్దవాళ్లతో తను ఇంటరాక్ట్ అవుతుంటారు. మరి నేనేంటి ఇలా ఉండిపోయాను.. ఇది నా జీవితం కాదుకదా అనుకున్నాను. తిరిగి ప్రిపేర్ అవ్వడం మొదలు పెట్టాను. నాకు మొదట్లో భయం ఉండేది. దానిని పోగొట్టుకున్నాను. ఈ సుదీర్ఘ ప్రయాణంలో అమ్మానాన్న చెల్లి, మా వారి సపోర్ట్ ఎంతో ఉంది.

న్యూస్ పేపర్ రీడింగ్ కీలకం

నేను మొదట్లో న్యూస్ పేపర్‌ను ఎక్కువ చదివేదానిని కాదు. అది నా రైటింగ్‌లో ప్రభావం చూపించింది. న్యూస్‌పేపర్స్ చాలా కీలకం. ఇంటర్వ్యూకు కూడా ఉపయోగపడుతుంది. ఆప్షనల్స్‌లోనూ రిఫ్లెక్ట్ అవుతుంది. ఇంటర్వ్యూకు వెళ్లే రోజువరకూ న్యూస్ పేపర్ చూడాల్సిందే. బల్క్ ఇన్ఫర్మేషన్ వద్దు. స్టాటిస్టిక్స్ కీలకం. ఇవన్నీ కావాలంటే న్యూస్‌పేపర్‌ను రెగ్యులర్‌గా ఫాలో కావాలి.

ఆరోగ్యం చాలా కీలకం

సివిల్స్‌ను నెగ్గడంలో హెల్త్ చాలా చాలా కీలకం. మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాలి. రోజూ వాకింగ్, యోగా, ధ్యానం చేసేదాన్ని. ఇవి మన మనసును, శరీరాన్ని దృఢంగా ఉంచుతాయి. మన మెంటల్ స్టేటస్ ఎంత స్ట్రాంగ్‌గా ఉంటే.. మనం సివిల్స్‌ను అంత తొందరగా రీచ్ కాగలం. ఫిట్‌నెస్ చాలా అవసరం. మనలను మనం కాపాడుకోవడానికైనా మనం స్ట్రాంగ్‌గా ఉండాలి కదా.

సొంతంగా నోట్సు

చదువుకునే సమయంలో ముఖ్యమైన పాయింట్‌ను హైలెటర్‌తో మార్క్ చేసుకుంటాను. ప్రతి రివిజన్‌కూ కలర్ మారుస్తూ వెళతాను. ఇలా చేయడం వలన ఎన్నిసార్లు రివిజన్ చేశామనేది తెలుస్తుంది. సొంతంగా నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలి. మనం కోచింగ్ తీసుకున్నా.. వారు మెటీరియల్ ఇచ్చినా సరే.. సొంతంగా నోట్స్ ఉండాలి.

సోషల్ మీడియాకు దూరం

డీవియేషన్స్ ఉండకూడదు. ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. చదువుకోవడానికి షెడ్యూల్ వేసుకోవాలి. మనం వేసుకున్న షెడ్యూల్ రోజూ 100 శాతం రీచ్ కావాలి. కనీసం 80 శాతం తప్పనిసరిగా కంప్లీట్ చేయాలి. ఫోకస్‌గా ఉండాలి. బ్రాడ్ ఆలోచనలు వద్దు. ఇది ఎగ్జామ్ మాత్రమే. జీవితం కాదు. ఒంటరిగా చేసే యుద్ధం. మన ప్రయత్నం చేయాలి. ఒకవేళ రీచ్ కాకపోతే ఏమీ కాదు. భయం వద్దు.

ఢిల్లీకి వెళ్లే అవసరం లేదు

నేను 7వతరగతి వరకు మాత్రమే డే స్కాలర్‌ని. తర్వాతంతా హాస్టలే. నేను సివిల్స్ ప్రిపరేషన్ కోసం ఢిల్లీలో రెండేళ్లున్నా. తర్వాత ఇంటినుంచే ప్రిపేర్ అయ్యా. కోచింగ్ తీసుకోవాలి, ఢిల్లీలోనే ఉండాలనేం లేదు. ఇంట్లోనే ఉండాలా, నగరానికి వెళ్లాలా అనేది ఎవరికి వాళ్లు నిర్ణయించుకోవాలి.

మనలను మనం ప్రశ్నించుకోవాలి

మనలను మనం ప్రశ్నించుకోవడం చాలా ముఖ్యం. ఫలానా సమస్య వచ్చింది. దీనికి నేనేం చేశాను..? ఈ రోజు చదవలేకపోయాను.. ఎందుకు చదవలేకపోయాను.? ఈ రోజు మూడ్ బాగోలేదు.. ఎందుకు బాగోలేదు దీనికి నేనేం చేయాలి..? ఇలా మనకు ఎదురయ్యే ప్రతి సమస్యకూ పరిష్కరించేందుకు మనమేం చేస్తున్నాం అనేది చాలా ముఖ్యం. ఇంట్లో పేరెంట్స్‌కు కూడా మనకేం కావాలో మనం స్పష్టంగా చెప్పగలగాలి. రిజిడ్‌గా ఉండకూడదు. ఓపెన్ మైండ్‌సెంట్ ఉండాలి.

క్రమశిక్షణ ముఖ్యం

ఏదైనా రీచ్ కావాలంటే సూపర్ ఇంటలిజెన్స్ ఉండాల్సిన అవసరం లేదు. నిలకడైన క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. ఇది ఒంటరి పోరాటం. మనం ఒంటరిగా రాయాల్సిన పరీక్ష. ఒక్కోసారి పదిరోజులు చదివినా సబ్జెక్ట్ బుర్రలోకి సరిగా పోదు. ఒక్కోసారి రెండురోజుల్లోనే బుర్రలోకి పోతుంది. మూడ్ స్వింగ్స్ ఉంటాయి. ఇది సుదీర్ఘ ప్రక్రియ కావడంతో తప్పదు. మనం కంగారు పడాల్సిన పనిలేదు. ఇదేమీ కేక్ వాక్ కాదు. కష్టపడాల్సిందే.

ఇదే జీవితం కాదు

ఈ చదివే ప్రక్రియ ఎలా ఉంటుందంటే.. గూటిలో దూరుకుని ఉండే పక్షిలా ఉంటుంది. ఇంత ప్రయత్నం చేసినా అనుకున్నది సాధించలేకపోవచ్చు. అంతమాత్రాన పోయేదేం లేదు. ఇదే జీవితానికి అంతం కాదు. మనం 100 శాతం ఫోకస్‌గా ప్రయత్నం చేస్తున్నామా లేదా అనేదే ముఖ్యం. మన ఫోకస్ అంతా గోల్‌పైనే ఉంటే చేరుతాం. లేదంటే లేదు. మనకు ఇది సాధ్యం కాదు అని తెలుసుకున్నాక.. దానిపైన కూర్చోవడం వేస్ట్. మనం ఏది చేయగలమో అదే చేసుకోవాలి.

అమ్మాయిలు రెండింతలు కష్టపడాలి

మాకు అన్నీ తెలుసు, ఏదైనా సాధించగలం అనే మైండ్‌సెట్ అబ్బాయిలకు ఉంటుంది. వాళ్లు సాధించలేకపోయినా సరే అదే మైండ్‌సెట్‌తో ఉంటారు. అమ్మా యిలను సొసైటీ తక్కువగా చూస్తుంది. మన మైండ్‌ను అది తెలీకుండానే వెంటాడుతుంటుంది. అమ్మాయిలు ఏదైనా రీచ్ కావాలంటే అబ్బాయిలకన్నా రెండింతలు కష్టడాలి. కష్టపడితే సాధ్యంకానిది లేదు. ముఖ్యంగా అమ్మాయిలు అనుకుంటే ఏదైనా సాధించగలరు.

ఏదైనా నేర్చుకుంటేనే ఆనందం

ఎప్పుడూ పుస్తకాలు చదువుతూనే ఉండలేం. అప్పుడప్పుడు చిన్నచిన్న బ్రేక్‌లు తీసుకోవాలి. మైండ్‌కు రిలీఫ్ వస్తుంది. నేను ఒక్కోసారి రెండుమూడు రోజులు వరుసగా వెబ్‌సిరీస్‌లు చూసేదాన్ని. అవి చూశాక సంతోషం అనిపిస్తుంది. అయితే నాకు దీనికన్నా 20 రోజులు కష్టపడి చదివి ఏదైనా నేర్చుకుంటే వచ్చే ఆనందమే ఎక్కువ.

చాలా త్యాగం చేశాం..

మా అమ్మాయి ఏడేళ్ల పోరాటం చేసింది. ఈ ప్రక్రియలో మేము చాలా త్యాగం చేయాల్సి వచ్చింది. పిల్లల కలలు నెరవేరాలంటే పెద్దలు చాలా త్యాగాలు చేయాల్సిందే. ఎవ్వరూ దీనికి అతీతులు కాదు. పిల్లలు గోల్ రీచ్ అయ్యాక.. మనం అప్పటి దాకా ఏం త్యాగం చేశామో అంతకు రెట్టింపు పొందుతాం. మా అమ్మాయి చదువుతో పాటు ఆరోగ్యం కోసం ఒకరకంగా కఠోర తపస్సు చేసింది. డైట్, నిద్ర, వ్యాయామం.. అన్నింటిలో క్రమశిక్షణ పాటించింది. ఆరోగ్యం చాలా ముఖ్యం. కొత్తగా ప్రిపేర్ అయ్యేవాళ్లకు కూడా నేను ఇదే చెబుతా. ముఖ్యంగా అమ్మాయిలు.. ఆరోగ్యం, చదువు పేరలల్‌గా బేలన్స్ చేసుకోవాలి.

- కర్ణపు చలమారెడ్డి, డి.శ్రీకృష్ణ (కీర్తిరెడ్డి తల్లిదండ్రులు)



Sunday Special

12 చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

- 20తులాల బంగారు, 300 గ్రాముల వెండి, రెండు బైకులు స్వాధీనం



అరెస్టు అయిన నిందితులు, స్వాధీనం ఆభరణాలను చూపుతూ వివరాలు తెలుపుతున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడిన ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 20తులాల బంగారు, 300గ్రాముల వెండి, రెండు మోటార్ బైకులు, ఒక టీవీని స్వాధీనం చేసుకున్నామని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంతో పాటు ఎర్రగుంట్ల, బద్వేలు, కలమల్ల, బద్వేలు రూరల్ తదితర చోట్ల తాళాలు వేసిన ఇళ్లలో బీగాలు పగులగొట్టి వీరు దొంగతనాలకు పాల్పడారన్నారు. ఇందుకు సంబంధించి 12కేసులు నమోదయ్యాయన్నారు. 2024 జనవరి నుంచి తొమ్మిది నెలల పాటు దొంగతనాలు సాగాయన్నారు. వల్లెపు నవీన్, గణేశ్, మంజుల గంగాధర్, కొమ్మెర రాజశేఖర్, గంగాధర్, వల్లెపు చంద్రశేఖర్ ఈ దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వీరిని శనివారం పులివెందుల సమీపంలోని వీఎన్‌పల్లె రింగురోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరు చిన్నతనంలోనే జల్సాలకు, షికార్లకు, మద్యం సేవించేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో క్రైమ్ డిటెన్షన్ పార్టీ టీంకు త్వరలోనే అభినందనలు, రివార్డులు అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ చాంద్‌బాషా, రూరల్ సీఐ రమణ ఉన్నారు.

మండలాలకు తరలిన పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాల వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈవో షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను మండలాలకు తరలిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. తొలి విడతగా నాలుగు మండలాలకు పంపించామన్నారు. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల గోదాము నుంచి మండలాలకు పుస్తకాలను తరలించే వాహనాలను డీఈవో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి ఒకటి నుంచి 10వ తరగతి ఫస్ట్ సెమిస్టర్ వరకు 9,76,346 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా 7,20,161 పుస్తకాలు జిల్లాకు చేరాయని చెప్పారు. ఇంకా 2,56,185 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు. తొలి విడతగా రాజంపేటకు 23,158, సిద్దవటానికి 9,944, అట్లూరుకు 5,840, బద్వేల్‌కు 12,777.. మొత్తం 51,719 పాఠ్యపుస్తకాలను తరలించామని చెప్పారు. పాఠశాలలు ప్రారంభసమయ్యే సమయానికి విద్యార్థులందరికి పుస్తకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ టెక్స్ట్ బుక్స్ జిల్లా మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారి మఠంలో సమాధుల తొలగింపుపై విచారణ



తొలగించిన సమాధుల స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారి మఠంలో అభివృద్ధి పేరుతో వీరబ్రహ్మంగారి వంశస్తుల సమాధులను తొలగించారన్న ఫిర్యాదుపై దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ శనివారం విచారణ చేపట్టారు. పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి సతీమణి మారుతీ మహాలక్ష్మమ్మ దేవదాయశాఖ ఉన్నతాదికారులకు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణ చేపట్టారు. ఈ మేరకు నివేదికలను పైఅధికారులకు పంపుతామని తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమాధులు తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

జిల్లాలో హైఅలర్ట్

- ఏక కాలంలో పలుచోట్ల తనిఖీలు





లాడ్జీలో తనిఖీ చేస్తున్న రిమ్స్ ఎస్ఐ జయరాములు, డాగ్‌స్క్వాడ్‌తో బస్సులో తనిఖీ చేస్తున్న దృశ్యం

కడప క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో హైఅలర్ట్ ప్రకటించారు. జన సమూహ ప్రాంతాల్లో జిల్లా అంతటా ఏకకాలంలో పోలీసు అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, లాడ్జీలు, హోటళ్లలో బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో బస్సులు ఇతర వాహనాలను కూడా తనిఖీ చేసి గట్టి నిఘా ఉంచారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని వారి వివరాలు సేకరించారు.

మత్స్యకారులకు చంద్రబాబు కొండంత అండ



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బెస్త సాధికార కమిటీ ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు చంద్రబాబు కొండంత అండ అని బెస్త సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు యాటగిరి రాంప్రసాద్ తెలిపారు. శనివారం కడప నగరం ఎన్టీఆర్ సర్కిల్‌లో బెస్త సాధికార కమిటీ ఆధ్వర్యంలో మత్స్యకారులకు అండగా ఉంటున్న నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మత్స్యకారులకు చేసింది ఏమీ లేదని పైగా జీఓ నెంబర్.217 తీసుకువచ్చి మత్స్యకారుల జీవనోపాధికి విఘాతం కలిగించేలా చెరువులను దళారులకు అప్పచెప్పే కుట్రకు పాల్పడ్డారన్నారు. అయితే ప్రతి హామీని దశలవారీగా అమలుచేస్తున్న చంద్రబాబునాయుడుకు మత్స్యకారులు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లె వెంకటసుబ్బయ్య, ఆవుల వెంకటేశ్, పసుపులేటి వినోద్, బి.వెంకట్, పోలి సాయి, రెడ్డయ్య, వర్థిబోయిన రాము తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థానీయుల వీసాలు రద్దు : జేసీ

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 27 వ తేదీ నుంచి మన దేశంలో పాకిస్థానీయుల కోసం జారీ చేసిన సార్క్ వీసాలను రద్దు రద్దు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాకిస్తానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీ చేసిన మెడికల్, దీర్ఘ కాలిక వీసాలు, దౌత్య మరియు అధికారిక వీసాలు మినహా ప్రస్తుతం చెల్లుబాటు అయ్యే వీసాలు తక్షణమే రద్దు అవుతాయని జేసీ తెలిపారు. సార్క్ వీసా గడువు శనివారంతో ముగియడంతో పాకిస్థానీయులు దేశం నుంచి నిష్క్రమించాలని తెలిపారు. వీసా ఆన్ అరైవల్, వ్యాపారం, సినిమా, జర్నలిస్ట్, రవాణా, సమావేశం, పర్వతారోహణ, విద్యార్థి, సందర్శకుల వీసా, గ్రూపు టూరిస్టు వీసా, యాత్రికుల ప్రదర్శన, మైనార్టీలకు గ్రూపు పిల్గ్రీం తదితర వీసాలన్నింటికి ఈ నెల 27 వ తేదీ ఆదివారం తుది గడువని.. వీరంతా దేశం విడిచి వెళ్లాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మెడికల్ వీసాలు ఈ నెల 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని వివరించారు. దీనికి అనుగుణంగా జిల్లాలోని సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పుష్పగిరిలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



హంస వాహనంపై శివపార్వతులు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

వల్లూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరిలో జరుగుతున్న కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం వేద పండితులు శాస్త్రోకంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాలాన్నే శివకేశవులకు విశేషంగా పంచామృతాభిషేకం నిర్వహించి పూలతో అలంకరించారు. ప్రదోష కాలంలో శివాలయంలో ధ్వజారోహణం ఆలయ ప్రధాన అర్చకులు చేపట్టారు. ముందుగా మహానంది చిత్రపటాన్ని ధ్వజస్తంభానికి వేలాడదీసి ఆహ్వానం పలికారు. అనంతరం కామాక్షి సమేత వైద్యనాథేశ్వరుడిని సుందరంగా అలంకరించి హంస వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే కొండపైన లక్ష్మిచెన్నకేశవ సన్నిధిలో పూజలు నిర్వహించి ప్రదోష కాలంలో ధ్వజారోహణం చేపట్టారు. లక్ష్మిచెన్నకేశవ ఉత్సవ మూర్తులను అలంకరించి తిరుచ్చి వాహనంపై గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి శివకేశవులను దర్శించుకుని కాయ కర్పూరం చెల్లించి మొక్కులు తీర్చారు. ఆలయ కార్యనిర్వాహకులు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఫాసిజమే మానవాళికి శత్రువు

- యుద్ధం అంటే వినాశనమే
- స్నేహ సంబంధాలను పెంచుదాం.
- ఇస్కఫ్ 20 రాష్ట్ర మహాసభలో వక్తల పిలుపు





మహాసభల్లో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహారి.. హాజరైన జనం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవాళికి ఫాసిజం ప్రధాన శత్రువు అని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహారి అన్నారు. శనివారం స్థానిక గొల్లపల్లెలోని శేషసాయి కల్యాణ మండపంలో ఇస్కఫ్ 20వ రాష్ట్ర మహాసభ (ఇస్కఫ్)ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ సుకుమారన్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పహల్గావ్‌లో ఉగ్రవాద దాడిలో అసువులు బాసిన వారి ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఇస్కఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పదిహారి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మానవాళి తీవ్ర సంక్షోభాల మధ్య జీవిస్తోందన్నారు. అధిపత్యం కోసం అగ్రరాజ్యాలు యుద్ధోన్మాదాన్ని పెంచుతున్నాయని తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి విషయం గుర్తు చేశారు. భారతదేశంపై కూడా ఉగ్రదాడి జరిగిందని. ఉగ్రవాదులకు కూడా అగ్రరాజ్యాలే ఆయుధాలు అమ్ముతున్నాయన్నారు. యుద్ధం మానవాళి వినాశనానికి దారి తీస్తోందన్నారు. ఫాసిజం జడలు విప్పుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అది మానవాళికి ప్రధాన శత్రువని అన్నారు. హిట్లర్ ఫాసిజానికి వ్యతిరేకంగా నిలబడిన నేతలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రానున్న ఆగస్టు 30న ఫిడేల్ క్యాస్ట్రో జయంతిని దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విదేశాల మధ్య సంబంధాలు బలహీన పడుతున్నాయని, ఈ క్రమంలో ప్రజల మధ్య స్నేహ సంబంధాలను పెంచడం ద్వారా మానవ సంబంధాలు బలపడుతాయని అన్నారు. ఇందు కోసం ఇస్కఫ్ దశాబ్దాలుగా పని చేస్తోందన్నారు. మరెంత చైతన్యవంతంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. భారతదేశానికి అన్ని ప్రపంచ దేశాల ప్రజాలతో స్నేహ, శాంతి పూర్వక సంబంధాలు మెరుగు పర్చడం ఇస్కఫ్ ఆశయమని స్పష్టం చేశారు. చైన్నై నుంచి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డిప్యూటీ కౌన్సిల్ జనరల్ ఆఫ్ రష్యా సెర్జెయ్ అజారోస్ సందేశమిచ్చారు. ఆయన మాట్లాడుతూ రష్యా భారతదేశం మధ్య సహకార సంబంధాలకే చాలా విస్తారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం భారతదేశం కలిసి పని చేయాలన్నారు. రష్యా, భారతీయ సంబంధాల విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ అంచనాలు చాలా ఉన్నంతంగా ఉన్నాయన్నారు. భారత సమాజం అభివృద్ధికి సోవియట్ కాలం నుంచి ఇప్పటికీ రష్యా పూర్తి అండగా ఉందని తెలిపారు. ఇరుదేశాల ప్రజల మధ్య, ప్రభుత్వాల మధ్య సాంస్కృతిక, క్రీడలు, కళా సంబంధాలు బలంగా ఉన్నాయన్నారు. దీని ద్వారా భారతీయ నిపుణులు రష్యాలో శిక్షణ పొందారని గుర్తు చేశారు. విద్యకు సంబంధించి చాలా ఉన్నతమైన మేళవింపు ఉందన్నారు. భారత్ ఒక శక్తివంతమైన దేశంగా వెలుగొందాలని తాము అభిలషిస్తున్నామన్నారు. రెండు దేశాల భవిష్యత్ కోసం కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్ నివేదికను ప్రవేశ పెట్టారు. గత మూడేళ్ల ఇస్కఫ్ కృషిని వివరించారు. మతాన్ని, సంస్కృతిని కలుషితం చేసి ప్రజలను మభ్యపెట్టడానికి చూస్తున్న శక్తుల నిజ స్వరూపాన్ని చర్చకు పెట్టి సమాజానికి దిశానిర్దేశం చేయడం మనందరి కర్తవ్యం అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు వెంకటరెడ్డి, ఇస్కఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ నరసింహులు, తమిళనాడు ఇస్కఫ్ నేత సుధాకర్, తెలంగాణ ప్రతినిధి అరుణ, తుంగా శ్రీధర్, రామచంద్రయ్య, మాచిరెడ్డి, డాక్టర్ సంజీవయ్య, బి.కృష్ణ, ఇస్కఫ్ కోశాధికారి సత్యాంజనేయ, అనకాపల్లె నేత మాధవరావు, సీహెచ్ శ్రీదేవి, అరుణ్‌కుమార్, యువజన సమాఖ్య జాతీయ నేత లెనిన్‌బాబు, క్షేత్రపాల్‌రెడ్డి, వెంకటరావు, సీపీఐ నియోజకవర్గ నాయకుడు మురళి, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాకిస్థానీయులూ.. పదండి

- మదనపల్లెలో ఐదుగురు గుర్తింపు...
- పోలీసులు నోటీసులు జారీ

మదనపల్లె, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ పౌరసత్వం కలిగి కొన్నేళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని పోలీసులు గుర్తించారు. పహల్గామ్ తీవ్రవాద దాడి నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్రం వీసాలు ఆపేసి, ఇప్పటికే మనదేశంలో నివసిస్తున్న వారిని పాకిస్థాన్ పంపేయాలని నిర్ణయించింది. ఇందులో బాగంగా పోలీసులు ఎక్కడికక్కడ జల్లెడ పడుతున్నారు.. ఈ క్రమంలో మదనపల్లెలో కొన్నేళ్లుగా నివాసం ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని శనివారం గుర్తించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసి దేశం విడిచి వెళ్లాని సూచించారు.

మదనపల్లె పట్టణంలోని కురవంకలో పాకిస్థాన్ పౌరసత్వం కలిగిన ఐదుగురు స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. శనివారం వారికి పోలీసులు నోటీసులు అందించి తక్షణం దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. అయితే దీనికి సంబంధించి తదుపరి ఉత్తర్వులు ఏవీ రాకపోవడంతో ప్రస్తుతానికి వారు ఇక్కడే ఉన్నారు. స్థానిక ఆంజనేయస్వామి గుడి వీధికి చెందిన గులాబ్‌జాన్ కొన్నేళ్ల క్రితం సౌదీకి వెళ్లి అక్కడ పాకిస్తానీయుడైన బషీర్ అహ్మద్ భట్‌ను పెళ్లి చేసుకుంది. వీరికి ఐదుగురు సంతానం. వారికి పాకిస్థాన్ పౌరసత్వం ఉంది. తర్వాత పిల్లలను ఐదుగురిని తీసుకుని గులాబ్‌జాన్ మదనపల్లెకు చేరుకుంది. ఇక్కడ మరో కుమారుడు జన్మించాడు. అతడికి భారతదేశ పౌరసత్వం ఉంది. మదనపల్లెలో ఉంటున్న పాకిస్థాన్ పౌరసత్వం కలిగిన గులాబ్‌జాన్ ఐదుగురు సంతానం ఇక్కడే విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఇండియాలో రెసిడెన్స్ వీసా పొంది రెన్యువల్ చేసుకుంటూ ఇక్కడే ఉంటున్నారు. వారిలో పెద్ద కూతురు షాజియా ఖాన్వాల్(35) బెంగళూరులో కేరళకు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. రెండవ సంతానం మహమ్మద్ యాసీన్ (32) మదనపల్లెలో పనిచేస్తూ ఇక్కడికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. మూడవ సంతానమైన షమ్మా బషీర్ అహమ్మద్ వాల్మీకిపురంలో వివాహం చేసుకుంది. నాల్గో సంతానమైన యాస్ బషీర్, ఐదవ సంతానం ఫాతీమ బషీర్ ఇద్దరు అవివాహితులు. అయితే ఇప్పటికిప్పుడు దేశం విడిచి వెళ్లడానికి వాళ్లు నిరాకరించడంతో ఉన్నతాధికారులకు తెలియజేసి వారి ఆదేశాల కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు

సిద్దవటం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భార్య అనారోగ్యం కారణంగా మృతిచెందుతుందన్న బాధలో శనివారం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన సిద్దవటం పోలీసులు అతన్ని కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. అట్లూరు క్రాస్ రోడ్డులో నివాసం అబ్బిరెడ్డి అనే వయోవృద్ధుడు తన భార్య ఆరోగ్యం గత కొన్నిరోజులుగా సరిగ్గా లేకపోవడంతో ఆమె మృతి చెందుతుందనే మనస్థాపంతో రైలు కింద పడి మృతి చెందాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు మండలంలోని కనుమలోపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఆత్మహత్యాయత్నం చేసుకోబోతుండగా గమనించిన రైల్వే అధికారులు స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని అబ్బిరెడ్డిని కాపాడి స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

సీసీ కెమెరాలు చోరీ

కలకడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కలకడ మండలంలోని ఆదర్శ పాఠశాల గేట్ వద్ద ఏర్పాటు చేసిన రెండు సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న వాచ్‌మన్ రామాంజులు రాత్రి భోజనానికి వెళ్లి తిరిగి వచ్చేలోపు ఈ చోరీ జరిగింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందింది.

రైలుకింద పడి మహిళ మృతి

పుల్లంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవసముద్రం వడ్డిపల్లెకు చెందిన పసుపులేటి సీతమ్మ శనివారం ఉడుమువారిపల్లె సమీపాన రైలుకింద పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సీతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సంఘటనపై రేణిగుంట రైల్వేపోలీసు గౌరీశంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బడి తాళాలు పగలగొట్టిన ఆకతాయిలు

- రిజిస్టర్ల చింపివేత
- కుర్చీలు, బెంచీలు విరగ్గొట్టి హల్‌చల్

సుండుపల్లె, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని దిగువగుల్లావాండ్లపల్లె ఎంపీపీ పాఠశాల తాళాలు పగలగొట్టి ఆకతాయిలు హల్‌చల్ చేశారు. ప్రహరీ దూకి వచ్చి బోర్డుపై పెయింట్‌తో లవ్ సింబల్స్ వేసి హంగామా చేసినట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ కృష్ణవేణి శనివారం తెలిపారు. పాఠశాలలోని రికార్డు గదిలోకి వెళ్లి రిజిస్టర్లు చింపి కుర్చీలు, బెంచీలు విరగ్గొట్టారన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా వారిని గుర్తించి కేసు నమోదు చేయాలని ఆమె కోరారు. ప్రభుత్వ బడి తాళాలు పగులగొట్టడం నేరంగా పరిగణించి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



బీరువా తాళాలు పగలగొట్టిన దృశ్యం

ప్రభుత్వ పథకాల్లో లక్ష్యాలను సాధించాలి

- గ్రామాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకూడదు
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమ, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల్లో వందశాతం లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రెవెన్యూ, సామాజిక పింఛన్లు, తాగునీరు, జీఎస్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణం, డ్వామా, పంచాయతీరాజ్, పారిశుధ్య తదితర అంశాలపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరులకు మెరుగైన రెవెన్యూ సేవలను అందించాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో వెనుకబడిన మండలాల తహసీల్దార్లతో ఆర్డీవో, సబ్ కలెక్టర్ స్వయంగా సమీక్షించి ఒక వారంలోగా పెండింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ఫీజిబులిటీ నివేదికను వెంటనే పంపాలని సూచించారు. జిల్లాలో పచ్చి మేత పెంపకానికి డివిజన్, మండల స్థాయిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ డీకేటీ, ప్రైవేట్ భూములను ప్రతి మండలంలో కనీసం 3 వేల ఎకరాలను గుర్తించాలన్నారు. ఇందుకు ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకోవాలి. జిల్లాలో 2023 డిసెంబరు నుండి 2024 అక్టోరు 31 మధ్యలో మృతి చెందిన వారి భార్యలకు ప్రభుత్వం నూతనంగా లక్ష పింఛన్లను మంజూరు చేయగా, ఇందులో మన జిల్లాకు 3316 వితంతు పింఛన్లను మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే అర్హత కలిగిన దరఖాస్తులకు సంబంధించిన డెత్ సర్టిఫికెట్లను రేపు సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ గృహ నిర్మాణానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో ఇంకనూ జిల్లాలో 14శాతం పెండింగ్ ఉందని, ప్రగతిలో వెనుకబడిన మండలాలు లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలని తహసీల్దార్లకు సూచించారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నదియాదేవి, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు - బొలెరో వాహనం ఢీ

- ఒకరు మృతి.. 14 మందికి గాయాలు



మృతి చెందిన రామాంజుల్‌రెడ్డి

రామాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి రామాపురం మండలం హసనాపురం పంచాయతీ టోల్‌గేట్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 14 మందికి గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు నిలబడి ఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొనడంతో రామాంజుల్‌రెడ్డి(80) అనే వ్యక్తి మృతి చెందగా రమాదేవి, జగదీశ్‌బాబు, గీతావాణి, సుమిత్ర, ఆస్మా, రెడ్డిరాణి, విజయ్‌కుమార్‌రెడ్డి, మాన్యత, మహేశ్, రాణమ్మ, చౌడయ్య, జమున, డ్రైవర్ ప్రసాద్‌రెడ్డి, కండక్టర్ నరసింహులుకు గాయాలయ్యాయి. వీరిలో రామాంజుల్‌రెడ్డి, రమాదేవి, జగదీశ్‌బాబు, గీతావాణి, సుమిత్ర వంగిమళ్లకు చెందిన వారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. మిగిలిన వారు ఇతర ప్రాంతాలకు చెందినవారు. ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వంగిమళ్ల నుంచి రాయచోటికి వస్తుండగా టోల్‌గేట్ సమీపంలోకి రాగానే బొలెరో వాహనం పంక్చర్ అయింది. దీంతో బొలెరో వాహనానికి టైరు మార్చుతుండగా వెనుకవైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రామాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామాంజుల్‌రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందారు. రమాదేవి, జగదీశ్‌బాబు, గీతావాణి పరిస్థితి విషమించడంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెవెన్యూ పెట్రోలు పంపు ఏర్పాటుకు స్థల పరిశీలన



ఐవోసీ ప్రతినిధులతో పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు

పీలేరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పీలేరులో పెట్రోలు పంపు ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి పీలేరు రెవెన్యూ అధికారులు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పెట్రోలు పంపు ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, అందుకు అనువైన స్థలం ఎంపిక చేయాల్సిం దిగా తమకు ఆదేశాలు అందాయన్నారు. దీంతో గూడరేవుపల్లె పంచాయతీ సర్వే నెం.198లో కొత్తగా నిర్మితమవుతున్న నేషనల్ హైవేకు ఆనుకుని 0.75 ఎకరాల భూమి సేకరించామన్నారు. ఆ స్థలాన్ని శనివారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చెన్నై శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, మేనేజర్ రాజ్ కుమార్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. వారు తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారన్నారు. ఇప్పటికే జైళ్ల శాఖ, ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలుచోట్ల పెట్రోలు పంపులు నడుస్తుండగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోనూ ఏర్పాటు కానుండడం విశేషం.

ఉత్కంఠభరితంగా బండలాగుడు పోటీలు



ఒంటిమిట్ట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఒంటిమిట్ట చెరువు కట్టపై వెలసిన కాల గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. భక్తులు, ప్రజల కేరింతల మధ్య బండలాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. గెలుపొందిన ఎడ్ల యజమానుల కు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, శేషారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ అంపైర్లు, స్కోరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) నుంచి అంపైర్లు, స్కోరర్ల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి క్రికెట్ అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎంపీ, ఏసీఏ జిల్లా అధ్యక్షుడు కేసినేని శివనాథ్ (చిన్ని) గ్రామీణ స్థాయిలో క్రికెట్ అభివృద్ధి చేయడంతో పాటు క్రికెటర్లకు ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారన్నారు. ఇందులో భాగంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయకుమార్ తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు కనీసం పదో తరగతి పాసై ఉండాలని, 18 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వయసు వారు అర్హులన్నారు. క్రికెట్‌పై మౌలిక అవగాహన ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తి గలవారు సీడీసీఏ రూపొందించిన గూగుల్ ఫారంలో సంప్రదించాలన్నారు. ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు సెల్‌ఫోన్ నెంబర్లు 8886185559, 9000214966లను సంప్రదించాలన్నారు.

హాకీ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా శాప్, సెట్విన్ ఆధ్వర్యంలో మదనపల్లెలో నిర్వహించనున్న హాకీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె బీటీ కళాశాల మైదానంలో ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో 8 నుంచి 18 ఏళ్లలోపు క్రీడాకారులకు కోచ్ నౌషాద్, సీనియర్ హాకీ క్రీడాకారులు శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు 94923 77889 నెంబర్‌కు ఫోన్ చేయాలని డీఎస్‌వో కోరారు.

పెంచలకోనకు ప్రత్యేక బస్సు సర్వీసు

రాజంపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు రాజంపేట డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎం.రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఉదయం 5.15 గంటలకు రాజంపేటలో బయలుదేరి 6.30 గంటలకు కడప బస్టాండ్‌కు చేరుతుందన్నారు. అనంతరం కడప నుంచి 6.40 గంటలకు పెంచలకోనకు బయలుదేరుతుందన్నారు. చిట్వేలి, రాపూరు మీదుగా ఉదయం 10.45 గంటలకు పెంచలకోనకు చేరుతుందని పేర్కొన్నారు. తిరిగి 11.15 గంటలకు పెంచలకోనలో బయలుదేరి ఇదే మార్గంలో మధ్యాహ్నం 1.45 గంటలకు రాజంపేటకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి 2.15 గంటలకు రాజంపేటలో బయలుదేరి రాపూరుకు 3.45 గంటలకు చేరుకుంటుందని వివరించారు. 4 గంటలకు రాపూరులో బయలుదేరి చిట్వేలి, రాజంపేట మీదుగా కడపకు రాత్రి 7 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



రైల్వేకోడూరు జాతరకు వందేళ్లు

- 30 నుంచి మొదలు
- భారీ ఏర్పాట్లు.. పోలీసు బందోబస్తు
- దొంగలను పట్టుకునేందుకు డ్రోన్ కెమెరాతో నిఘా



బలిజవీధిలో వెలసిన గంగమ్మ తల్లి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరు బలిజవీధిలో నిర్వహించే జాతరకు వందేళ్లు నిండాయి. మొదట జాతర ఉత్సవాలను సుగవాసి కుటుంబం మొదలు పెట్టింది. తర్వాత యెలిశెట్టి, ఆ తర్వాత పంద్రా కుటుంబీకులు చేస్తున్నారు. 1925లో జాతరను ప్రారంభించారు. ఈ ఏడాదికి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జాతర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ జాతరకు ఒక కమిటీ ఉంది. గంగమ్మతల్లి పేర బలిజవీధిలో సుమారు రూ.80 లక్షలు పెట్టి స్థలాన్ని కొనుగోలు చేసి, ఆ స్థలంలో ఓ దాత కల్యాణ మండపాన్ని నిర్మించారు.

30 నుంచి జాతర

బలిజవీధిలో వెలసిన గంగమ్మ జాతర ఈనెల 30వ తేదీ నుంచి మొదలై మూడురోజుల పాటు జరుగు తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ప్రతి వీధిలో విద్యుత్ దీపాలంకరణలు, గంగమ్మ ప్రతిమల తో కూడిన విద్యుత్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. 30వ తేదీ నుంచి వేషాలు, విజయవాడ తప్పెట్లు తదితర కార్యక్రమాలతో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదేరోజు అర్ధరాత్రి పల్లకీ ఉత్సవం, అ నంతరం అంకాళమ్మ దేవస్థానంలో అమ్మవారి ప్రతి మను బంకమన్నుతో తయారు చేసి వెండి, బంగారు వస్తువులతో అలంకరించి అక్కడి నుంచి మండపం వరకు తీసుకువస్తారు. అమ్మవారు వెళుతుండగా భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. మండపం వద్ద వేపమండలతో గుడిని ఏర్పాటు చేసి గంగమ్మతల్లిని నిలబెడతారు. ఆ రోజంతా భక్తులకు దర్శనం కల్పిస్తారు. మే 2వ తేదీ ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని నిమజ్జనానికి తీసుకెళతారు. దీంతో జాతర ముగుస్తుంది. ఈ జాతరకు తిరుపతి, కడప, వెంకటగిరి, రాజంపేట, నెల్లూరు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తులు వస్తారు.

జాతరకు పటిష్ఠ బందోబస్తు..



రైల్వేకోడూరులో నిర్వహించే జాతరను ఎలాంటి సమస్యలు లేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. జాతరలో డ్రోన్ నిఘా పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దొంగలను పట్టుకోవడానికి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. ఈ మేరకు జాతర నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చాం.

- మనోజ్‌రామనాథ్‌హెగ్డే, రాజంపేట ఏఎస్పీ





చలువపందిళ్లు

10 నుంచి దేవుని కడప శ్రీవారి తెప్పోత్సవాలు

కడప కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి తెప్పోత్సవాలు మే 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లు ఆలయ పుష్కరిణిలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు తెప్పలపై విహరించి భక్తులను కటాక్షించనున్నారు. అందులో భాగంగా మే 10న శ్రీకృష్ణ సమేత గోదాదేవి మూడు చుట్లు, 11న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర-స్వామి ఐదు చుట్లు, 12న శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ వేంకటేశ్వరస్వామి వారు ఏడు చుట్లూ తెప్పలపై తిరిగి భక్తులకు కనువిందు చేయనున్నారు. కాగా ఆ మూడు రోజులలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5-30 నుంచి 6 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నారు. అలాగే ఆలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. భక్తులు తెప్పోత్సవాలను తిలకించి స్వామివారి సేవలో తరించాలని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి కోరారు.

ప్రమాదాల దారి.. నాలుగు రోడ్ల రహదారి

- 15 నెలల్లో 18 మంది మృతి
- వాహనచోదకుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు
- వీధిన పడుతున్న కుటుంబాలు


క్రీస్తురాజపురం వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్లు కలిపే జంక్షన్

దువ్వూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి నిర్లక్ష్యం నిండుప్రాణాలకు ముప్పు తెస్తోంది. అతివేగం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడంతో జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఎంతో మంది మృత్యువాత పడుతుండగా.. వారి కుటుంబీకులు దిక్కులేని వారవుతున్నారు. మరికొందరు క్షతగాత్రలు అవిటివారుగా మిగిలిపోతున్నారు.

దువ్వూరు మండల పరిధిలోని నాలుగు రోడ్ల రహదారి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రమాదాలకు అడ్డుకట్ట పడటంలేదు. ఇక్కడ తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ పరిస్థితి ఇడమడక, కానగూడూరు, జిల్లేళ్ల, దువ్వూరు బైపాస్, క్రీస్తురాజపురం, గుడిపాడు, చింతకుంట సమీపంలో నెలకొంది. బైపాస్ రోడ్డుపైకి గ్రామాల్లో నుంచి వచ్చే వాహనదారులు అజాగ్రత్తగా వాహనాలు నడపడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

15 నెలల్లో 18 మంది మృతి

దువ్వూరు మండల పరిధిలో 2024 జనవరి నుండి ఈయేడు మార్చి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలను గమనిస్తే 18 మంది మృత్యువాతన పడ్డారు. మరో 20 మంది గాయపడిన వారిలో ఉన్నారు. వారిలో కొందరు అవిటివారిగా జీవనం కొనసాగిస్తున్నారు.

ప్రమాదాలకు ఇవే కారణాలు

- ప్రైవేటు ట్రావెల్స్ అతివేగంగా వెళుతూ అదుపు తప్పి బోల్తాపడుతున్నాయి.
- కొన్ని చోట్ల సూచిక బోర్డులు సరిగా లేకపోవడం, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తోంది.
- డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్లలో మాట్లాడడం ప్రమాదాలకు కారణమవుతోంది.
- ఎక్కువగా యువత మద్యం సేవించి బైకులు నడపడం మరో కారణం.
- ఆటోలలో పరిమితికి మించి జనాలను ఎక్కించుకుని వెళ్లడం.
- నాలుగు రోడ్ల రహదారి ఎక్కే సమయంలో అజాగ్రత్తగా వాహనాలు నడపడం.
- లైసెన్సులు లేకుండా బైకులు నడపడం, హెల్మెట్లు ధరించకపోవడం లాంటి కారణాలు రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.

మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పనకు చర్యలు : జేడీ


మాట్లాడుతున్న మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులు

కడప రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కడప పసుపు మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పనకు వీలైనంత త్వరలో తగు చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరక్టర్ రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం మార్కెట్ యార్డులో పసుపు కొనుగోలు, కమిషన్ ఏజెంట్లతో సమావేశమై సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు కమిషన్ ఏజెంట్లు మార్కెట్ యార్డులో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు జేడీ రామాంజనేయులు సానుకూలంగా స్పందించారు. రెండు, మూడు రోజుల్లో తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మార్కెట్‌యార్డు కార్యదర్శి సుజాత, సూపర్‌వైజర్ గంగన్న, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కోశాధికారి గుర్రం కొండ మహేష్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ శిల్పకళా దినోత్సవం


శిల్పకళా ప్రదర్శనలో విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ శిల్పకళా దినోత్సవం సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, స్కల్ప్చర్ విభాగం విద్యార్థుల కళా ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. శనివారం విద్యార్థుల శిల్పకళా ప్రతిభను ఉద్ఘాటిస్తూ, కళాకృతుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ జి. విశ్వనాథ్ కుమార్, విద్యార్థుల శిల్ప ప్రదర్శనను అభినందిస్తూ ఈ వేడుక ద్వారా విశ్వవిద్యాలయం సృజనాత్మకతను ప్రోత్సహించడంలో, భవిష్యత్ కళాకారులను ప్రేరేపించడంలో, శిల్పకళా రంగానికి మద్దతు ఇవ్వడంలో తన నిబద్ధతను మరోసారి నిరూపించుకుందన్నారు. ప్రదర్శనకు ఏర్పాట్లు చేసిన శిల్పకళ విభాగ అధ్యాపకులను, విద్యార్థులను వీసీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


సుభాష్‌చంద్రబోస్ మృతదేహం

చాపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు-మైదుకూరు జాతీయ రహదారిలోని మండల కేంద్రం చాపాడు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీబీఐటీ కళాశాల విద్యార్థి కామనూరు సుభాస్ చంద్రబోస్ (18) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... దువ్వూరు మండలంలోని కృష్ణంపల్లె గ్రామానికి చెందిన సుబాస్ చంద్రబోస్ సీబీఐటీ కాలేజీలో డిప్లమా మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చియ్యపాడు గ్రామంలో అతని బంధువుల ఇంటిలో ఉండి చదువుకుంటున్నాడు. శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో పరీక్ష రాసేందుకు సీబీఐటీ కాలేజీకిమోటారు సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా గేదె రావడంతో దాన్ని ఢీకొని కిందపడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మోటారు సైకిల్‌పై వెనుకవైపు కూర్చొని ఉన్న అతని స్నేహితుడు శృతికుమార్ కూడా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి..


భాస్కర్‌రెడ్డి మృతదేహం

పులివెందుల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని నారాయణ కళాశాల సమీపంలో నివాసముంటున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి భాస్కర్‌రెడ్డి (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. శనివారం ఉదయం ఈ ఘటన బయట పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. భాస్కర్‌రెడ్డి నారాయణ కళాశాల సమీపంలోని ఓ ఇంట్లో నివాసముంటున్నారు. అతని భార్య, కుమారుడు మరొకచోట ఉంటు న్నా రు. వీళ్లకు కుటుంబ కలహాలు ఉన్నాయి. కాగా, భాస్కర్‌రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఏం జరిగిందో ఏమో కానీ శనివారం ఉదయం ఆయన నిద్రలేవకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మురళీనాయక్ వెల్లడించారు.

లారీ, కారు ఢీ... వార్డు కౌన్సిలర్ మృతి


మృతిచెందిన షేక్ ఖాదర్‌బాషా (ఫైల్)

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకలకుంట పంచాయతీ జెడ్.కొత్తపల్లె గ్రామ సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మైదుకూరు మున్సిపాలిటీ ఐదో వార్డు కౌన్సిలరు షేక్ ఖాదర్‌బాషా మృతి చెందాడు. బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు... మైదుకూరు మండలం నుంచి ఖాదర్ బాషా కారులో బద్వేలుకు వెళుతున్నాడు. అదే సమయంలో బద్వేలు నుంచి మైదుకూరు వైపు వస్తున్న బొగ్గులారీ ఢీకొంది. దీంతో ఖాదర్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, ఖాదర్‌బాషా మృతి పట్ల ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఫోన్ ద్వారా సంతాపం తెలిపి.. వారి కుటుంబ సభ్యులకు ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పలువురు టీడీపీ నేతలు ఖాదర్ బాషా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళిలర్పించారు.

బ్రహ్మంసాగర్‌లో పడి వ్యక్తి మృతి


వీరబ్రహ్మం మృతదేహం

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. అతని వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి విజయవాడలోని మైలవరం మండలానికి చెందిన వీరబ్రహ్మం (40)గా గుర్తించామన్నారు. ఈ విషయం వారి బంధువులకు తెలిపామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలుకు తరలించామని.. బంధువులు వచ్చిన వెంటనే ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

డబ్బుల కోసం బెదిరింపు.. కేసు నమోదు

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని బెదిరించి, చంపే ప్రయత్నం చేశారని రైస్ మిల్లు యజమాని సూరిశెట్టి ప్రసాద్ గుప్తా శనివారం మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల సమాచారం మేరకు సూరిశెట్టి ప్రసాద్ రైస్ మిల్లు యజమాని. అతన్ని రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాటిని పాలీస్ పట్టించి అక్రమవ్యాపారం చేస్తున్నావని చొక్కం ఆంజనేయులు అనే వ్యక్తి బెదించి డబ్బులు డిమాండ్ చేశాడు. బియ్యం టెస్ట్ చేసే ఇనుప కమ్మితో చంపడానికి బెదించాడని సూరిశెట్టి ప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆంజనేయులును అరెస్టు చేసి కమలాపురం సబ్ జైల్‌కు రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- డీఎఫ్‌వో వినీత్‌కుమార్



డాక్టర్ కె.డి. వరప్రసాద్‌రావు డాక్టర్ ఎస్ లావణ్య లక్ష్మిలకు జ్ఞాపికలను అందజేసి సత్కరిస్తున్న డీఎఫ్‌వో వినీత్‌కుమార్, జేడీ శారదమ్మ తదితరులు

కడప రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పశువులు, జంతువుల ఆరోగ్యం సంక్షేమంపై పశువైద్యాధికారులు, శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ పేర్కొన్నారు. కడప నగరం కోటిరెడ్డి సర్కిల్‌లోని జిల్లా పశువైద్యశాఖ కార్యాలయంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జంతు ఆరోగ్యంతో పాటు వాటి పరిరక్షణ, సంక్షేమం కొరకు అంకిత భావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జంతువుల జీవన ప్రమాణాలను మెరుగు పరచాలన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో కూడా పశువైద్యులు పాత్ర ముఖ్యమన్నారు. వారి సేవలు గొప్పవని ప్రశంశించారు. పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ మాట్లాడుతూ పశువైద్య విశిష్టతను చాటి చెప్పేందుకు పశువైద్య దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. పశువైద్యశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరు జంతువుల నుంచి మానవులకు వ్యాపించే వ్యాధులను నివారించి, నియంత్రిస్తున్నామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న టెక్నాలజీ సమాచారాన్ని పశుపోషకులకు ఎప్పటికప్పుడు అందజేస్తున్నామన్నారు. జంతు సంబంధిత ఆహార ఉత్పత్తుల భద్రత కు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జంతువుల ఆరోగ్యం, సంక్షేమం, ఉత్పాదకతను మెరుగు పరచడానికి పరిశోదనలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం మెరుగైన పశువైద్య సేవలను అందించిన. సీనియర్ వెటరనరీ వైద్యు లు డాక్టర్ కేడీ వరప్రసాద్‌రావు, డాక్టర్ ఎస్.లావణ్య లక్ష్మిలకు జ్ఞాపికలను అంద జేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కడప, పులివెందుల తదితర విపిసి డిప్యూటీ డైరక్టర్లు రమణయ్య, మంగేశ్, రంగస్వామి, రాజశేఖర్, ఏడిలు ఉమా, వెంకటసుబ్బయ్య, శివరామిరెడ్డి, శ్రీదర్‌లింగారెడ్డి, మారుతీతో పాటు, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... పొడదుప్పి మృతి



సీకేదిన్నె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని పొడదుప్పి మృతి చెందింది. కడప-రాయచోటి జాతీయ రహదారిలోని జమాల్‌పల్లి సమీపంలో శనివారం ఉదయం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయపడిన దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మేఘనాథ్‌రెడ్డి మృతదేహం

లింగాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండలం బిదినంచెర్ల గ్రామానికి చెందిన నల్లపురెడ్డి మేఘనాథ్‌రెడ్డి శనివారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురికావడంతో మృతి చెందాడు. ఎస్ఐ మదుసూదన్‌రావు కథనం మేరకు వివరాలిలా.. మేఘనాథరెడ్డికి లింగాల మండలం వెలిదండ్ల గ్రామ పొలంలో చీనీ తోట ఉంది. తోటకు నీరందించడానికి మధ్యాహ్న సమయంలో ఇంటి వద్ద నుంచి వెళ్లి స్టార్టర్‌ను ఆన్‌చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. భర్త ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో మేఘనాథ్‌రెడ్డి భార్య లక్ష్మి తోట వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కల్లూరుపల్లెను గ్రీన్ విలేజ్‌గా చేస్తాం..

- అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్


కల్లూరుపల్లె తాండాలో ప్రజలతో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్


చక్రాయపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కల్లూరుపల్లె తాండాను గ్రీన్ విలేజ్-ఐడీ ఫ్రీగా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కల్లూరుపల్లె తాండాలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా తయారు చేసే మద్యం, డ్యూటీ చెల్లించని మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను గుర్తించడం, అనుమానితుల ఇళ్లు, పాత నిందితుల ఇళ్లు సమగ్రంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమం కింద ఈ ఆపరేషన్ చేపట్టామన్నారు. ఇప్పటికే ప్రత్యామ్నాయ జీవనోపాధి కింద కొందరిని గుర్తించి ప్రభుత్వం తరపున లోన్లు ఇప్పించే ప్రతిపాదనలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చెన్నారెడ్డి, చక్రాయపేట ఎస్ఐ కృష్ణయ్య, ఆర్కేవ్యాలీ ఇన్‌స్పెక్టర్ ఉలసయ్య, ముద్దనూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విన్నీలత, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వరరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పహల్గాం మారణకాండను నిరసిస్తూ జర్నలిస్టుల ర్యాలీ



క్యాండిల్ ర్యాలీలో ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్మూ-కాశ్మీర్ పహల్గాం మతోన్మాద మారణకాండను నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. శనివారం సాయంత్రం ఏపీయుడబ్ల్యూజే, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా, వీడియో గ్రాఫర్, ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఎర్రముక్క పల్లె సర్కిల్ అమరవీరుల స్థూపం వరకు ప్రదర్శన నిర్వహించారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని వ్యతి రేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉగ్రదాడిలో మర ణించిన వారికి నివాళులు అర్పించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. టెర్రరిజం నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహ కరించాలని కోరారు. మతంపేరుతో మారణహోమం సృష్టించిన పాకిస్థాన్ తీవ్రవాదులకు ఎలా బుద్ధి చెప్పాలో భారతదేశ ప్రభుత్వానికి, ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో ఏపీ యూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీను, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, గౌరవాధ్యక్షుడు శ్రీనాథ్, ఆంధ్రజ్యోతి బ్యూరో ఎక్కంటి ఆంజనేయులు, ఏబీఎన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ సంఘం నాయకులు శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో మీడియా ప్రతి నిధులు పాల్గొన్నారు.



WANTED
కడపటౌన్‌లోని GMRస్కూల్‌లో పనిచేయుటకు అనుభవజ్ఞులైన ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ (1 To 5) మరియు హైస్కూల్ (6 To 10) టీచర్లు (అన్నిసబ్జెక్టులకు), హాస్టల్ వార్డెన్‌లు మరియు అడ్మిషన్స్ చేయుటకు PROలుకావలెను. సెల్: 99000 41111, 73821 83100
Ajc-233731

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్
చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్: 90105 01122.
Ajc-233686

TO-LET
VERY SPACIOUS COMMERCIAL SPACE G+2(4000SFT)WITH BASEMENT PARKING IS AVAILABLE AT CHENNUR BUS STAND, KADAPA, A.P., 70329 13073, 79045 06151
AJC-233862

ప్లాటు కొనబడును
నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డు, కనుపర్తిపాడు, కాకుటూరు, బుజబుజ నెల్లూరు, వైపాడు రోడ్డు ఏరియాలోని ప్లాటు కొనబడును. సం.ప్ర. 93464 48054, 79812 46665
AJR-205748

ముస్లిం వివాహ సంబంధాలు
బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ మ్యారేజ్ బ్యూరో, నంద్యాల జిల్లా. సెల్: 87908 44959. (2వ సంబంధాలు కలవు.)
AJL-236381

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును. (రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237514

UTI MUTUAL FUND
క్రొత్తపథకం **UTI - MULTI CAP FUND** ముఖవిలువ రూ.**10**లు పెట్టుబడి రూ.**2,50,000** లు పెట్టండి 8 సం॥ల తరువాత రూ.**9,00,000**లు + 21 సం॥ తరువాత రూ. **35,00,000** లు + పథకము **ROM OD** చూడండి. పాన్, ఆధార్, ఫోటో చెక్‌తో సంప్రదించండి. (ఆఖరు తేది 13.05.25) **AVS Chandra Reddy, MFD, UTI MF 21-10, Gunta Bazar, Near Tirumala Hospital, Kadapa.**
Ajc-000

CHANGE OF NAME
I, KONDETI SUBRAHMANYAM (Old name), holder of Passport No. K7667118, D.No.5/119-A, Eguvareddypalli, T.Kammapalli, Pullampet Mandal, Annamayya District, A.P., hearby changed my name as KONDETI SUBRAMANYAM (New name) S/o KONDETI GANGAIAH,
AJC-233872

పాసుపోర్టు పోయినది
షేక్ మహమ్మద్ రఫి తండ్రి షేక్ ఖాదర్ బాషా D.No. 6/258-1, ముకుందార గడ్డ, రాజంపేట పోస్ట్ & మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్, పాసుపోర్టు నెం. X7112123, ఇండ్లు మారుతుండగా పోయినది. దొరికినవారు అందజేయగలరు. సెల్ :99496 63075
Ajc-000

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

11న దూదేకుల విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం

కడప మారుతీనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వెలువడించిన 10వ తరగతి, ఇంటర్‌మీడియట్ విభాగాలలో అత్యధిక మార్కులు సాధించి ఉత్తీర్ణులైన దూదేకుల విద్యార్థినీ, విద్యార్థులకు వచ్చే మే 11వ తేదీ ఆదివారం సాయంత్రం 3 గంటలకు నగర ఎర్రముక్కపల్లెలో గల దూదేకుల జిల్లా భవన్‌లో ప్రతిభా పురస్కార అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరుగనున్నట్లు ఏ.పీ. నూర్‌బాష్ దూదేకుల బీసీ, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గుటూరి చిన్నరాజా పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం స్థానిక దూదేకుల భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంఘంతో పాటుగా కడప నూర్‌బాష్ దూదేకుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పై కార్యక్రమం చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్‌మీడియట్‌లో 950 మార్కులకు పైగా సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు, అలాగే 10వ తరగతిలో 560 మార్కులకు పైగా సాధించిన వారు మే నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9440677839, 9951667362, అనే నెంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకేసుల బాషా, ఎన్. ఖాదరయ్య, రాష్ట్ర నాయకుడు పి. ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు బేబీ, సువాసిని తెలిపారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం 2025-26 విద్యాసంవత్సరానికి పేద విద్యార్థులకు 1వ తరగతిలో ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలో 25శాతం ఉచిత సీట్ల కేటాయింపులకు మార్గదర్శకాలతో కూడిన నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ అయ్యాయని వారు తెలిపారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5శాతం, షెడ్యూలు కులాలు 10 శాతం, షెడ్యూలు తెగలు 4శాతం, బలహీనవర్గాలకు (బీసీ,మైనార్టీ, ఓసీ) చెందిన పిల్లలకు 6శాతం సీట్లు ఉంటాయన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో కానీ మీ దగ్గరలోని సచివాలయం, మీసేవ సెంటర్లు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం కానీ సంప్రదించవచ్చని వారు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు 28 నుంచి మే 15 వరకు గడువు ఉందన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రం యథాతథం

కడపనాగరాజుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం కూడా జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ ప్రజలకు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

'చీటింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోండి'

కడప మారుతీనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రే డింగ్ పేరుతో దాదాపు 12 కోట్ల రూపాయలు చీటింగ్ చేసిన కడప నగరానికి చెందిన పాపిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి కారణంగా 32 కుటుంబాలు మోసపోయి దిక్కుతెలియని స్థితిలో ఆత్మహత్యలకు పూనుకుంటున్నారని బాధితులు టేకూరు రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు త్వరితగతిన స్పందించి ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు శనివారం కడపలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. మా సంస్థలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని సోమశేఖర్‌రెడ్డి ఆశ చూపడంతో పేద, మధ్యతరగతి ప్రజలు పెట్టుబడులు పెట్టడం జరిగిందన్నారు. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే బెదిరిస్తున్నారని బాధితులు పేర్కొన్నారు. ఈ విషయంగా నారా లోకేష్, హోమ్ మంత్రి అనిత స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారన్నారు. లేనిపక్షంలో ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాయి, చైతన్య వెంకటసాయి, రాజ్యలక్ష్మి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో, స్కూటర్ ఢీ : ముగ్గురికి గాయాలు

సీకేదిన్నె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):చింతకొమ్మదిన్నె మండలం మూలవంక వద్ద ఆటోను స్కూటర్ ఢీ కొనడంతో చింతకొమ్మదిన్నెకు చెందిన లక్షుమ్మ, రెడ్డెమ్మ, నరసింహాఅనే ముగ్గురికి గాయాలయ్యాయి. కడపలో వ్యాపారం ముగించుకుని ఆటోలో మూలవంకనుంచి చింతకొమ్మదిన్నెకు వెళుతుండగా రాయచోటి వైపునుంచి అతివేగంగావచ్చిన స్కూటర్ ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో లక్షుమ్మ, రెడ్డెమ్మలకు తీవ్రగాయాలు కాగా ఆటో డ్రైవర్ నరసింహాకు స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

రాజధాని అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలి

వేంపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాలలో స్థానిక, స్థానికేతరకు సంబంధించి రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించారన్నారు. రాజధాని ప్రాంతంలో విద్య, ఉద్యోగ అవకాశాలు మిగతా ప్రాంతాల కంటే ఎక్కువగా ఉంటాయి. రాజధాని అన్ని ప్రాంతాలకు సంబంధించినది అక్కడ అన్ని ప్రాంతాల వారికి సమాన అవకాశాలు లభించాలంటే రాజధాని ప్రాంతాన్ని ఫ్రీజోన్‌గా ప్రకటించాలన్నారు.

వానపాముల ఎరువు రైతులకు లాభదాయకం


- ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు

చెన్నూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌డబ్ల్యూపీసీలో తయారయ్యే వానపాముల ఎరువు రైతులకు లాభదాయకమని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు అన్నారు. స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీలో శనివారం సిద్దవటం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దవటం మండల ఈవోఆర్‌డీ యాస్మిన్ భాను, చెన్నూరు ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు, రిసోర్స్ పర్సన్లు గురువేశ్వర్‌రావు, రాజవర్ధిని,పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పందులకు నిలయంగా జగనన్న కాలనీ

●ఒక్క ఇల్లూ పూర్తికాని వైనం





ఒక్క ఇల్లూ పూర్తికాని కొలుములపల్లి జగనన్న కాలనీ, జగనన్న కాలనీలో మోటార్ల వద్ద పొర్లుతున్న పందులు

సీకేదిన్నె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా పేదలకు ఇళ్ల నిర్మించే కార్యక్రమం చేపడుతూ ఇళ్లు కాదు ఊర్లనే నిర్మిస్తున్నామని ఎంతో గొప్పగా చెప్పుకుంది. అయితే వాస్తవంగా ప్రభుత్వం కొన్ని చోట్ల ప్రజలకు అనుకూలంగా లేని ప్రదేశాల్లో స్థలాలు కేటాయించడంతో ప్రజలు అక్కడికి ఇళ్ల నిర్మించుకోవాలంటే ఇష్టపడక అధిక ఒత్తిడికి తలొగ్గి కొంతవరకు నిర్మాణాలు మొదలు పెట్టినప్పటికీ ఒక్క ఇళ్లు కూడా పూర్తిచేయలేదు. చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె పంచాయతీలో అప్పటి జగనన్న ప్రభుత్వం 32 మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసింది. అయితే ఇక్కడ ఒక్క ఇళ్లు కూడా పూర్తిగా కట్టలేదు. అధికారుల ఒత్తిడితో స్థలాలు క్యాన్సిల్ చేస్తామని బెదిరించడంతో కొంతమంది పునాదులు వేయడం, మరికొందరు గోడల వరకు చేయడం జరిగింది. ఎంత ఒత్తిడి తెచ్చినప్పటికీ ప్రజలు ఇష్టపడకపోతే అవి పూర్తికాదని దీని ద్వారా తెలుస్తోంది. గ్రామాలకు దూరంగా కేటాయించడంతోపాటు పంచాయతీ కేంద్రం నుంచి దాదాపు ఏడు కిలోమీటర్ల దూరంలో గుట్టపైన స్థలాలు ఇవ్వడం, సమీపంలోని డంపింగ్‌యార్డు ఉండడంతో ప్రజలు అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకురాలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఎంతో డబ్బులు వృథా చేసి రెండు బోర్లు వేసి పైపులైను కూడా లాగినప్పటికీ అవి వృథాగా మారాయి.

● పందులకు నిలయం

జగనన్న కాలనీలో రెండు మోటార్లు ఉండడంతో ప్రతిరోజూ ఆ మోటార్ల ద్వారా నీటిని వదులుకుంటూ పందుల కాపరులు అక్కడ నివాసం ఏర్పాటు చేసుకుని పందులు పెంచుకుంటున్నారు. దీంతో జగనన్న కాలనీ పందులకు నిలయంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన ప్రదేశంలో స్థలాలు కేటాయించి ఉంటే ప్రజలు ఇళ్లు నిర్మించుకుని నివాసాలు ఉండేవారని ఇప్పటికైనా అధికారులు వారికి అనుకూలమైన ప్రదేశంలో గ్రామాలకు దగ్గరగా స్థలం కేటాయించాలని కోరుతున్నారు.

సమీపంలో డంపింగ్‌యార్డు

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటిస్థలాలు డంపింగ్‌యార్డు సమీపంలో ఇవ్వడంతో ఇక్కడ ఎవరూ ఇళ్లు నిర్మించుకునేందుకు ఇష్టపడలేదు. డంపింగ్ యార్డు దగ్గరలో ఉండడంతో అక్కడి కంపును భరించలేక ఎవరూ నిర్మించుకోలేదు. అధికారుల ఒత్తిడి వలన కొంతమేరకు పనులు మొదలు పెట్టినప్పటికీ ఎవరూ పూర్తిచేయలేదు.

వరలక్ష్మి, కొలుములపల్లి

7 కి.మీ. దూరంలో...

కొలుములపల్లె పంచాయతీ నుంచి దాదాపు 7 కి.మీ. దూరంలో ఇళ్లస్థలాలు కేటాయించడం జరిగింది. దీంతో ప్రజలెవ్వరూ అక్కడ ఇళ్లు నిర్మించుకునేందుకు ఇష్టపడలేదు.

- పుష్పాల అమృత

పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపంద చర్య



కమలాపురం అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య అని జనసేన కమలాపురం మండల ఇన్‌చార్జి లక్కీరామ్ తెలిపారు. శనివారం సాయంత్రం నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో మూడురోడ్ల కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌస్‌లాజం, మురళీక్రిష్ణ, గంగాధర్, జయప్రసాద్, ఆసిఫ్, రఘునాథ్‌రెడ్డి, రవివర్మ, బాలయ్యాసూరి, మారుతీ, రాజశేఖర్, హరి, ప్రతాప్‌రెడ్డి, వేణు, తేజ, కుమార్‌రెడ్డి, భరత్, రమేశ్, దిలీప్ పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

వేంపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో అమాయకులను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ పులివెందుల నియోజకవర్గ నాయకులు దాదాపీర్ ఖండించారు. ఇంత దుర్మార్గానికి ఒడిగట్టిన ఏ ఒక్కరినీ వదలకుండా శిక్షించాలని కోరారు.

పేదలకు వైద్య సేవలు అందించడం శుభపరిణామం

కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి



వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ కో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మెడికల్ క్యాంప్ నిర్వహించి పేదలకు వైద్యసేవలు అందించడం శుభపరిణామమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎన్.పాలగిరి గ్రామంలో శనివారం గ్రామ సచివాలయం ప్రాంగణంలో గ్రీన్‌కో ఫౌండేషన్ అనిమెల విండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు తులసినాయుడు, గ్రీన్‌కో కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులురెడ్డి, రాజేష్ హనుమంత్, మాజీ ఎంపీపీ ప్రసాదరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గండి ఓబయ్యాయాదవ్, ఎన్.పాలగిరి, టీడీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజలంతా శాంతియుతంగా మెలగాలి



కడప ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న పీఠాధిపతి

కడప కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో దేశ ప్రజలంతా శాంతియుతంగా మెలగాలని ఆస్తాన ఏ హజరత్ సయ్యద్ షా గౌస్ సర్మద్ ఖాద్రీ మసీదు పీఠాధిపతి హజరత్ సయ్యద్ ఇలియాస్‌బాషా ఖాద్రీ ప్రజలకు సూచించారు. శనివారం స్థానిక రవీంద్ర నగర్‌లోని మసీదును కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, స్వచ్ఛ కడప కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ఆమెకు వక్ఫ్‌బోర్డు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కడప ఎమ్మెల్యేను పీఠాధిపతి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జిలానీబాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



విద్యార్థికి నగదు బహుమతి అందిస్తున్న మన్సూర్ అలీఖాన్

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నకాష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను టీడీపీ కడప నగర ఉపాధ్యక్షుడు పి.మన్సూర్ అలీఖాన్ అందించారు. మొదటిస్థానం సాధించిన షేక్ రుబియాకు రూ.10వేలు, రెండోస్థానం సాధించిన షేక్ సుభానికి రూ.5వేలు, మూడోస్థానం సాధించిన షేక్ సూమ్‌కు రూ.3వేలు మన్సూర్ అలీఖాన్ చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షాకీరా బేగం ఖాద్రీ, సీఎంసీ చైర్మన్ గౌస్ బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.జ

35 జీవోను సవరించే వరకు ఆందోళనలు



నిరసన తెలుపుతున్న ఏపీపీఆర్ఎంఈఏ నాయకులు

కడప రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన 35 జీవోను సవరించే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి డిమాండ్‌చేశారు. 35 జీవోను వ్యతిరేకిస్తూ శనివారం ఏపీపీఆర్ఎంఈఏ ఆధ్వర్యంలో జడ్పీ ఉద్యోగులు జడ్పీ కార్యాలయ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సెక్షన్ల ఏవోలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దు

కడప క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు ఎవరూ బానిస కావద్దని వాటికి దూరంగా ఉండాలని కడప ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ సూచించారు. వైఎస్ఆర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో కేర్ కార్యక్రమంలో భాగంగా కడపలో ఉన్న డ్రగ్స్ డీ అడిక్షన్ సెంటరును శనివారం ఆయన సిబ్బందితో కలిసి సందర్శించారు. మాదక ద్రవ్యాల వ్యసన బాధితుల్లో అవగాహన పెంపొందించి వారికి మానసిక మద్దతును అందించారు. ఈ తరహా అవగాహన కార్యక్రమాలు భవిష్యత్తులో చాలా చేపట్టనున్నట్లు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

పెండ్లిమర్రి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె పంచాయతిలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి,సర్పంచ్ గంగిరెడ్డితో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగాఎంపీడీవో కూలీలతో మాట్లాడుతూ పనులు జరుగుతున్న చోట ప్రథమ చికిత్స పెట్టె,తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.అలాగే మస్టర్లను తప్పని సరిగా రాయాలన్నారు.పదిగంటలలోపు పనులు పూర్తచేసేలా చూడాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వరమ్మ,ఫీల్డ్ అసిస్టెంట్ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కడప(వినాయకనగర్), ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన పేద అర్చక పురోహితుడు శ్రీయపురాజు మహానంది తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న జిల్లా విశ్వహిందూ పరిషత్ అర్చక పురోహిత విభాగం, జిల్లా అర్చక పురోహిత సమైక్య అధ్యక్షుడు విజయ్ బట్టర్‌స్వామి వెంటనే తన బృందంతో కలిసి వెళ్లి మహానంది స్వామి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా కడప జిల్లా విశ్వహిందూ మందిర అర్చక పురోహి త సహప్రముఖ జిల్లా అర్చక పురోహిత సమైక్య తరపున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సాగర్‌శర్మస్వామి, ప్రభాకర్ శర్మ,సుధాకర్‌శర్మ,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పులి వాహనంపై అమ్మవారు ఊరేగింపు



కమలాపురం రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పెద్దచెప్పలి ఎల్లమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా శనివారం రాత్రి అమ్మవారికి పుష్పాలంకరణ చేశారు. ఆలయ చైర్మన్ తోట రవీంద్ర ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పులి వాహనంపై అమ్మవారిని కనులపండువగా ఊరేగించారు. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. కాగా ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కడప క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం పోలీసులు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పోలీసుస్టేషన్ల పరిధిలోని విద్యార్థులు, యువతకు, ఆటో ట్యాక్సీ, లారీ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

50 మందికి వడుగులు

సీకేదిన్నె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మక్కామసీదులో శనివారం డాక్టర్ ఇజాద్ ఆధ్వర్యంలో 50 మంది పిల్లలకు వడుగులు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం నిర్వహించిన వడుగులు కార్యక్రమంలో పిల్లలకు ఉచిత మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాలగిరి పీరూప్రసాద్, సిరాజుద్దీన్, హజరత్ అలీ, రఫి, సిద్దు హుస్సేన్, బాషూ, మౌలా, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కడప రైల్వేస్టేషన్‌లో శనివారం రైలు ప్రయాణికులకు మజ్జిగ బాటిళ్లను పంపిణీ చేశారు. కడపరైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ పర్యవేక్షణలో రైల్వే పార్శిల్‌కు చెందిన జియా-జోయా ట్రేడర్స్ సిబ్బంది ఆధ్వర్యంలో మజ్జిగ బాటిళ్లను రైల్వే ప్రయాణికులకు అందించారు. ఇలా ఎవరైన ప్రయాణికులకు సేవలను అందించాలంటే కడపరైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ అధికారులను సంప్రదించాలని కోరారు.



జనగణనలో కుల గణన చేపట్టాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో పలు పార్టీల, ప్రజాసంఘ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అప్పుడెప్పుడో బ్రిటిష్ కాలం నాడు చేపట్టిన కులగణన తప్ప దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇంతవరకూ కేంద్రంలో పాలన సాగించిన పాలకులు ఆ ఊసే ఎత్తకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా చేపట్టకపోవడం సరైందికాదని పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 60 శాతంగా వున్న బీ.సీ.కులాల ప్రజలు అన్ని రంగాలలో వెనుకబడి వున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్రంలో పాలనసాగిస్తున్న బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం జనగణనలో కుల గణన చేపట్టితీరాలన్నారు. బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎం. ఓబులేసు యాదవ్ అధ్యక్షతన శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తక్షణమే బీసీ కుల జనగణన చేపట్టి తద్వారా 52 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, జనసేన నాయకులు జీవీ రమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుర్రప్ప, ఆర్‌సీపీ రవిశంకర్‌రెడ్డి, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక సీమ కన్వీనర్ కారు ఆంజనేయులు, ప్రజాసంఘాల నాయకులు సీఆర్వీ ప్రసాద్, విద్యార్థి సంఘ ప్రతినిధి తిరుమలేష్, ఆమ్‌ఆద్మీపార్టీ నాయకులు శ్రీనివాసులు, బ్లడ్‌టూలీవ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టుపోగుల పవన్‌కుమార్, మహిళా సంఘం నగర కార్యదర్శి భాగ్యలక్ష్మి పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం
ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.
పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్
ప్రకటనలపై జి.యస్.టి. 5% అదనం
యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411193, 9985411189.
ప్రాంతీయ కార్యాలయాలు :
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411193 బద్వేలు : 9985921375 కోడూరు : 9985411193

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960
పులివెందుల - S.R.: 95812 61647
D.C.M.: 99854 11184

దళారుల చేతిలో ధాన్యం రైతు దగా

- బస్తా రూ.1700 ఉన్న ధర రూ.1300 తగ్గిన వైనం
- తీవ్రంగా నష్టపోతున్నామంటున్న వరి రైతులు
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలంటూ వేడుకోలు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దళారుల చేతిలో వరి ధాన్యం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టించి పనిచేసి రేయింబవళ్లు పంటను కంటికి రెప్పలా కాపాడుకుని చివరికి ఇంటికి చేర్చుకునేంత వరకు రైతుల కష్టాలు వర్ణించలేనివి. వ్యవసాయాన్ని నమ్ముకుని పంటలు సాగు చేసిన రైతన్నలకు చివరికి కష్టాలు, కన్నీళ్లే తప్ప కష్టానికి తగ్గ ఫలితం లభించలేదు. మార్కెట్లో ఒకసారి ఉన్న ధర ఉన్నట్లుండి పడిపోవడంతో ఆ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పోరుమామిళ్ల మండలంలో దాదాపు 2వేలకు పైగా వరి పంట సాగు చేశారు. పోరుమామిళ్ల, దమ్మనపల్లె, చల్లగిరిగెల, క్రిష్ణంపల్లె, రంగసముద్రం, టేకూరుపేట, అక్కల్‌రెడ్డిపల్లె, రంగసముద్రం విభవరం, క్రిష్ణంపల్లె ప్రాంతాలతో పాటు చాలా గ్రామాల్లో వరిని సాగు చేశారు. దాదాపు కొంత మంది 80 కేజీలు రూ.1700లకు అమ్ముకున్న రోజులున్నాయి. ప్రస్తుతం 80 కేజీలు ధర రూ.1300, రూ.1350 పలకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నట్లుండి ఒక్కసారిగా 80 కేజీలు బస్తా రూ.300, రూ.400 తేడా ఏంటని ప్రశ్నించినా కొనుగోలుదారులను దళారులు ఎక్కి రానీయకపోవడం, మీ ఇళ్లల్లోనే నిల్వ ఉంచుకోండి అని ఖరాఖండిగా చెప్పడంతో వ్యవసాయానికి తెచ్చిన అప్పులు చెల్లించాల్సి రావడంతో కనీసం అప్పులైనా తెచ్చుకుందామని రైతులు అమ్మకాలు మొదలుపెడుతున్నారు. మరికొందరు పెట్టుబడులు, కౌలుకు పోను తమ చేతికి ఏమీ రాలేదని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఎకరాకు దాదాపు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావిస్తే చాలా మంది రైతులకు 30 క్వింటాళ్లే దిగుబడి వచ్చింది. మైదుకూరు ఏరియాలో క్వింటా వరి మంచి ధర పలుకుతుందని దాదాపు రూ.2వేలు ధర పలుకుతున్నారని కొందరు రైతులు చెబుతున్నారు. కానీ పోరుమామిళ్ల ప్రాంతంలోనే ఇంత తక్కువగా ధర నిర్ణయించడం ఏమిటంటున్నారు. చాల మంది రైతులు రోడ్ల పక్కన అమ్మకాలకు రాశులుగా పోసుకున్నారు. కనీసం వరి పండించిన రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని వాపోతున్నారు.


లారీకి లోడు ఎత్తేందుకు సిద్ధంగా ఉన్న వరి ధాన్యం

దిగుబడి తగ్గి ధాన్యానికి గిట్టుబాటు ధరలేక ఇక్కట్లు

నాలుగు ఎకరాల్లో దాదాపు రూ. ఒక లక్ష 20వేలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేస్తే తక్కువ దిగుబడి వచ్చింది. ఎకరాకు 40 బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా 30 క్వింటాళ్లే దిగుబడి వచ్చింది. 80కేజీలు బస్తా రూ.1700 ఉన్న ధర ప్రస్తుతం రూ.1300, రూ.1350 ధర పలుకుతుంది. అంతేకాక కొంత కౌలుకు భూమి చేసుకోవాల్సి వచ్చింది. ఇంత చేసిన కష్టానికి తగ్గ ఫలితం రాలేదు. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- లాయం రాముడు, తంబాబావివీధి

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. రాష్ట్రమంతటా వరి కొనుగోలు కేంద్రాలు ఉండడంతో అక్కడ రైతులందరికీ కనీసం ధర లభిస్తుంది. కానీ కడప జిల్లాలో మాత్రం దళారుల మాటే వేదంగా మారడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కావున ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగా జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తే జిల్లాలో వరి సాగు చేసిన రైతులకు కొంత మేరకైనా ఊరట లభించే అవకాశం ఉంది.

- బ్రహ్మయ్య, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు , దమ్మనపల్లె

నేడు ఐఐటీ ప్రతిభా పరీక్ష

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సూపర్‌బజార్ రోడ్డులోని బావన జూనియర్ కళాశాలలో శశాంక్ ఐఐటీ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఐఐటీ టాలెంట్‌టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శశాంక్ ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రంలో ఐఐటీ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9052902589 నంబరులో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అనిబిసెంట్ మున్సిపల్ మైదానంలోని గ్రేడ్-1 గ్రంథాలయం లైబ్రేరియన్ తిరుపతమ్మ తెలిపారు. ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఈ శిక్షణ శిబిరంలో పుస్తక పఠనం కథలు వినడం, చెప్పడం పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీషు, గణితంపై ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. విద్యార్థుల్లో ఉత్సాహం, ఉల్లాసం కోసం క్యారమ్స్, జిరాఫీ చెస్ క్రీడలు నేర్పిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా సీపీఐ ఎంఎల్ 52వ వ్యవస్థాపక దినోత్సవం


జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బద్వేలు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓబయ్య పట్టణంలోని నెల్లూరు రోడ్డులో జెండా ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. 1974వ సంవత్సరం పశ్చిమ బెంగాల్‌లో భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పార్టీ ఏర్పాటు అయిందన్నారు. నేటి వరకు అనేక నిర్బంధాలను అధిగమించి రాజీలేని ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తూ ఈ రోజు జాతీయ స్థాయిలో వామపక్ష పార్టీలలో అగ్రగామిగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, చంద్రమోహన్‌రాజు, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సవరణ

21-4-2025వ తేదిన ఆంధ్రజ్యోతి బద్వేల్‌జోన్‌లో ప్రచురితమైన కోర్టు దావా సమనులో యనమల సురేంద్రబాబు / వాది, గంగవరం బాల సుబ్బారెడ్డి / ప్రతివాది దావా సమనులో O.S.No.157/2024గా ప్రచురితమైనది. దానికి బదులు O.S. No. 137/2024గా సరి చూసుకోగలరు.
ఆర్.ఆర్.వర్మ అడ్వకేట్, బద్వేలు.

ఘనంగా గూడుమస్తాన్‌వలి ఉరుసు

- దర్గా ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు


గూడుమస్తాన్‌వలి దర్గాలో కిక్కిరిసిన భక్తులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో పెన్నానది వడ్డున వెలసిన గూడుమస్తాన్‌వలి ఉరుసు మహోత్సవం వైభవంగా జరిగింది. శనివారం సాయంత్రం నుంచి కులమతాలకు అతీతంగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. దర్గా కమిటీ ప్రెసిడెంట్ ముల్లాజానీ, కమిటీ సభ్యులు పర్యవేక్షణలో దర్గా ప్రాంగణం ఉరుసు కార్యక్రమంలో భాగంగా విద్యుత్తు దీపాలు అలంకరించారు. పలగాడి వీధి నుంచి దర్గా వరకు భారీగా భక్తులు కిక్కిరిశారు. ఉరుసు మహోత్సవ కార్యక్రమానికి వచ్చిన భక్తులు దర్గాలో ప్రత్యేక పాతెహాలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించి మొక్కుకున్నారు. ఉరుసు పురస్కరించుకుని గొప్ప ఖవ్వాలి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉరుసు ప్రాంగణంలో కాకుండా పెన్నానదిలో కొన్నిచోట్ల పేకాట స్థావరాలు వెలిసి వచ్చిన భక్తులకు జేబులు ఖాళీ చేసినట్లుగా ఆరోపణలున్నాయి. ఎక్కడ ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

లారీని ఢీకొన్న బైక్ .. వ్యక్తికి తీవ్రగాయాలు

ముద్దనూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి జాతీయ రహదారిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి ఆగిఉన్న లారీని వెనుకవైపు బైక్ ఢీకొనడంతో శివరామిరెడ్డి అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కొత్తపల్లె గ్రామానికి చెందిన శివరామిరెడ్డి బైక్‌పై వెళ్లి కొత్తపల్లెకు తిరిగి వస్తుండగా అదుపుతప్పి బైక్ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఢీ కొంది. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



29న ఉద్యాన సమ్మేళనం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఊటుకూరులో ఈనెల 29న ఉద్యాన సమ్మేళనం జరుగుతుందని ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఉద్యాన శాస్త్రవేత్తలచే పంటల సాగు ప్రసంగా లు, ఆధునిక, సాంకేతి కతపై ప్రదర్శన రైతులు, వ్యాపారస్తులు, ఎగుమతిదారులచే మార్కెటింగ్‌పై అనుసంధానం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలి పారు.



ప్రొద్దుటూరులో దొంగతనాలను అరికట్టాలి


ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో ఇటీవల జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు అభద్రతతో వున్నారని... వెంటనే దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కోరారు. శనివారం ఉదయం కడపలోని ఎస్పీ కార్యాలయంలో ఆయను ఎమ్మెల్యే కలిసి విజ్ఞప్తి చేశారు. అలాగే మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, గంజాయి లాంటి వాటిని పూర్తిగా అరిక ట్టాలన్నారు. ఇందుకు ఎస్పీ స్పందిస్తూ ప్రత్యేక పోలీసు బలగాలు దొంగలను పట్టుకునే పనిలో ఉన్నారన్నారు. త్వరలోనే వారి ఆటకట్టిస్తామన్నారు. అసాంఘీక కార్యకలాపాలన్నింటిపై పూర్తిస్థాయి నిఘా పెట్టామన్నారు. ఎస్పీని కలిసిన వారిలో టీడీపీ నేతలు వంగల నారాయణరెడ్డి, రసూల్‌గౌస్ ఉన్నారు.

'పది'లో బాలాజీ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనపరిచిన విద్యార్థులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో ఇటీవల 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో బాలాజీ హైస్కూలు విద్యార్థినీ విద్యార్థులు మంచి ప్రతిభ కనపరిచినట్లు బాలాజీ హైస్కూలు డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. శనివారం జమ్మలమడుగులోని బాలాజీ హైస్కూలులో ఆయన మాట్లాడారు. 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో తమ పాఠశాలలో చదివిన డి.నిఖిత 596 మార్కులు, కౌసిక్‌రెడ్డి 590 మార్కులు సాధించినట్లు తెలిపారు. మూడు దశాబ్దాలుగా బాలాజీ హైస్కూలు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధిస్తున్నారన్నారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో నిఖిత 596 మార్కులు, కౌసిక్‌రెడ్డి 590, ఎస్.సమీరా 588 మార్కులు, శాంతిప్రియ 587, కేవీ తపస్వినిరెడ్డి 586 మార్కులు, నరసింహారావు 580 మార్కులు సాధించారన్నారు. 59 మంది విద్యార్థులు 500 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బాలాజీ హైస్కూలు కరస్పాండెంట్ బైరెడ్డి నిఖిలారెడ్డి, ప్రిన్సిపాల్ శిరీష, ఏవో ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహుడికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి పెంచలయ్య స్వామి మాట్లాడుతూ వైశాఖ మాసం ఆరంభంతో లక్ష్మి నరసింహస్వామి దీక్ష మహా పాదయాత్ర ఉంటుందని స్వామివారి దీక్ష తీసుకోవాలనుకున్న భక్తులు వచ్చే నెల 3 నుంచి దీక్షా కార్యక్రమం మొదలవుతుందన్నారు. 41 రోజుల పాటు స్వామివారి దీక్ష వల్లెరవారిపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి పెంచలకోనలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వరకు మహా పాదయాత్ర సాగుతుందన్నారు. దీక్షలో పాల్గొనదలచిన భక్తులు తమను సంప్రదించాలని కోరారు. మధ్యాహ్నం భక్తులకు బండి ఓబయ్య కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

సీఎం సహాయనిధి పంపిణీ


సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌రెడ్డి

కలసపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం గ్రామానికి చెందిన దాసరి కాంతమ్మకు రూ.44,221 చెక్కును మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డిలు శనివారం బద్వేల్ టీడీపీ కార్యాలయంలో అందించారు. మార్కెట్ యార్డు చైర్మన్ రంతు, ఎగువ సగిలేరు నీటి సంఘం అధ్యక్షుడు చిన్నరంగారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పట్టాభిరెడ్డి, రాచెరువు నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, యువ నాయకులు మన్నెం మల్లికార్జునరెడ్డి, స్వామిరం గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ కంపెనీ తీరుపై డీఎస్పీకి ఎమ్మెల్సీ ఫిర్యాదు



జమ్మలమడుగు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డీఎస్పీ కార్యాలయంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రైతులు శనివారం డీఎస్పీ వెంకటేశ్వరరావుకు సోలార్ కంపెనీ తీరుపై ఫిర్యాదు చేశారు. పెద్దముడియం మండలం కొండ పాపాయపల్లె చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు గ్రేజింగ్ ల్యాండ్‌లో సోలార్ కంపెనీ వారు సోలార్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆ ప్రాంత రైతులకు బెదిరించి రైతులపై కేసు నమోదు చేశారని డీఎస్పీకి తెలియజేశారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత రైతు మధుసూదన్‌రెడ్డి భార్య సుజాత జరిగిన ఘటనపై విలేకరులకు వివరించారు.

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలి

- విద్యుత్‌శాఖ సిబ్బందికి ఎస్‌ఈ రమణ ఆదేశం


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా విద్యుత్ అధికారి ఎస్.రమణ

అట్లూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ సమస్యలు వచ్చిన వెంటనే అధికారులు స్పందించి పరిష్కరించాలని విద్యుత్ శాఖ సూపరెంటెండెంట్ ఎస్.రమణ ఆదేశించారు. శనివారం కొండూరు సబ్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ఎండలు భగభ గమండిపోతున్నాయని ఏప్రిల్, మే నెలల్లో ఎక్కువ ఎండలు ఉంటాయని, విద్యుత్ అంతరాయం సహించే స్థితిలో ప్రజలు లేరని, విద్యుత్ అంతరాయలు ఏర్పడినప్పుడు ఎందుకు కలిగిందో పరిశీలించి మరమ్మతులు చేసి అంతరాయాలు లేని విద్యుత్ అం దించాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు గాలీవాన మెరుపుల ప్రభావం విద్యుత్ వ్యవస్థపై ఉంటుందని, తగు చర్యలు తీసుకోవాలని ఏఈ విజయ కుమార్‌కు సూచించారు. రాబోవు పంట కాలం ఖరీఫ్ సీజను నాటికి వ్యవసాయ సర్వీ సులు విడుదల చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. కార్యాలయ ప్రాంగణంలోని ట్రాన్స్‌ఫార్మర్లు కార్యరూపం దాల్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కార్యాలయాల చుట్టూ తిప్పుకునే సంస్కృతి విడనాడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టరు గోపాల్, లైన్‌మెన్ ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఈయూ లక్ష్యం

- రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు


ఎన్నికైన ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ నేతలు

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయీస్ యూనియన్ పాటుపడుతోందని రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో యనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ 2017 పీఆర్‌సీ బకాయిలు రూ.800 కోట్లు యాజమాన్యంతో పోరాడి ఇప్పించామన్నారు. త్వరలో పెండింగ్‌లోవున్న ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీకి సంబంధించిన బకాయయిలు పెండింగ్ వున్న 46 రోజుల ఓటి అలవెన్సును నైట్ హాల్ట్ మంత్లీ ఇన్సెంటివ్‌లు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ప్రొద్దుటూరు డిపో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కడప జోనల్ అధ్య క్షుడు కె కృష్ణకుమార్, కార్యదర్శి ఎన్ రాజశేఖర్, కడప జిల్లా కార్యదర్శి ఏ రామూర్తి పాల్గొన్నారు.

ఈయూ డిపో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా బీసీ శేఖర్, బీవీ రమణ

ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) డిపో కమిటీ అధ్యక్షుడుగా బీసీ శేఖర్, కార్యదర్శిగా బీవీ రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్ఎస్‌రెడ్డి, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా వి. రఘునాథ్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా జి మునికుమార్ లు ఎన్నికయ్యారు. వారితో పాటు కడపజిల్లా కమిటీలోకి జిల్లా ఉపాధ్యక్షుడుగా పి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా డి.గోపాల్ ను ఎన్నుకున్నట్లు జోనల్ కార్యదర్శి ఎన్ఆర్ శేఖర్ తెలిపారు.

'ఆదిపై విమర్శలు చేయడం సిగ్గుచేటు'

జమ్మలమడుగు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శలు చేయడం సిగ్గుచేటని కూటమి నాయకులు టీడీపీ మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి , న్యాయవాది, కౌన్సిలర్ మునిసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు రిపబ్లిక్ క్లబ్ ఆవరణలో విలేకరుల సమావేశంలో సింగంరెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగులో అభివృద్ధి అంటే ఆది చిహ్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు, మంచినీటి సమస్యలు, కరెంటు సమస్యలను పరిష్కరించిన ఘనత ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిదే అన్నారు. న్యాయవాది, కౌన్సిలర్ మునిసుబ్బారెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగులో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి లేనిది వైఎస్ కుటుంబానికి రాజకీయం లేదన్నారు. సొంత డబ్బులు ఖర్చు పెట్టి వైఎస్ కుటుంబానికి ఆది సేవ చేశారన్నారు. ఆదినారాయణరెడ్డితోనే జగన్‌కు బిక్ష అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, కోవైట్ రఫి, మాధవరెడ్డి, బిందు నాగేశ్వరరెడ్డి, తోళ్లమడుగు ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ఆది,భూపేశ్‌ని విమర్శించే అర్హత వారికి లేదు'

కొండాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డిలను విమర్శించే అర్హత ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి లేదని కొండాపురం మండల కూటమి నాయకులు విమర్శించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో గండికోట ముంపువాసులకు ఆదినారాయణరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే ముంపు పరిహారం అందడంతో పాటు, పునరావాస కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీల వంటి అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో లావనూరు నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, బాబురెడ్డి, రామాంజులరెడ్డి, నాగిరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద అక్కడి ప్రజలతో, దుకాణందారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మా ట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదని, ప్రమాదాలకు గురై కుటుంబ సభ్యులకు గుండె కోతకు గురి చేయవద్దని అన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిస రిగా హెల్మెట్లు ధరించాలన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నియమాలను ప్ర తి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్ర మంలో ఎస్ఐ కొండారెడ్డి, సిబ్బంది పాల్గొ న్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

గోపవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఇన్‌స్పెక్టరు ఎం.నాగభూషణ్, ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. బద్వేలు - నెల్లూరు ప్రధాన రహదారిలో పీపీ కుంట సమీపంలో శనివారం వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ ప్రధాన లక్ష్యమన్నారు. లైసెన్సు ఉన్న వారు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు చేపడ తామన్నారు. కొంతమందికి అపరాధ రుసుం విధించామన్నారు.

చోరీలు జరుగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాశినాయన ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి):వేసవికాలంలో ప్రజలు చోరీలు జరుగకుండా అప్రమత్తంగా ఉండా లని కాశినాయన మండల ఎస్ఐ హనుమంతు పేర్కొ న్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శని వారం మండల వ్యాప్తంగా మైక్ ద్వారా ప్రజలు దొంగ ల బారిన పడి నష్టపోకుండా చైతన్య పరిచే కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గ్రామా ల్లో ఎవరైనా కొత్తవారు కనిపిస్తే పోలీసులకు గాని 100కుగాని సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలంటూ ప్రజలకు వివరించారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించండి


ఆటో యజమానులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వినోద్‌కుమార్

దువ్వూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆటో వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పకుండా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ వినోద్‌కుమార్ సూచించారు. దువ్వూరు మండలం చింతకుంట గ్రామంలో శనివారం ట్రాఫిక్ నిబంధనలపై ఆటోల యజమానులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి జనాలను ఆటోల్లో తిప్పకూడదని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎక్కడైనా, ఎవ్వరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సూచించారు. కార్యక్రమంలో వాహన చోదకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466 జమ్మలమడుగు - S.R.: 94404 72816 మైదుకూరు - S.R.: 91334 42886 బద్వేల్ - S.R.: 99666 83437 D.C.M. : 99854 11184